రాధ బాబు

మీసాల చివరలు కొనపండ్లతో నొక్కి పట్టి, సిరాలో ముంచిన కలం చేత్తోపట్టుకొని, పక్కనున్న కిటికీలో నుంచి యథాలాపంగా, చూస్తూ కూర్చున్నాను. ఇంతలో దభేలుమని శబ్దం అయింది. గుండె గుభేలు మంది. భయం నా ముఖాన్ని అంతా కప్పి వేసింది. కళ్ళు తేలిపోయినవి. అంత భయం నాకు ఎందుకు కలిగిందో నేను చెప్పలేను.

నాకు ఎదురుగానే మా పెద్దబ్బాయి, శాస్త్రి కూర్చుని చదువుకొంటున్నాడు. వాడూ తెల్లపోయి చూచి, "ఎవరో చేద బావిలో పడేసి వుంటారు" అన్నాడు.

ఎందుచేతనో ఆ మాట నాకు నిజమని తోచలేదు. తోచినట్లయితే నేను కుర్చీలో నుంచి ఎగిరిపడి లేవకపోయ్యే వాడ్నే. లేచి ఒక్క గంతులో దొడ్లో బావి దగ్గరకు పరుగెత్తాను. శాస్త్రీ నా వెనకాలే పరుగెత్తుకొని వస్తూ "ఇంకెవరున్నారూ ఆ దయ్యం. పాపే పడేసి వుంటుంది" అన్నాడు.

"వద్దే అమ్మా, నీవు బావి దగ్గరకు పోబోకే" అని నెత్తిన నోరు పెట్టుకొని అరచినా అది వినక వీలైనప్పుడల్లా అది బావి దగ్గరకు పరుగెత్తికెళ్ళి, ఎవ్వరూ లేకుండా చూచి బావిలో చేద వేస్తుంది. దాన్ని పైకి లాగలేక వదిలేసి వూరుకొంటుంది. ఇల్లా అనేక సార్లు జరిగింది. అందుకనే వాడు అల్లాగ అన్నాడు.

బావి దగ్గర పాపా లేదు. ఎవ్వరూ లేరు. తెల్లపోయి చూస్తూనే వున్నాము. ఇంతలోకే వీధిలో నుంచి పాప, వంట యింట్లో నుంచి మా ఆవిడా పరుగెత్తుకొచ్చారు. "ఏమిటి ఏమిటి?" అంటూ ఎటొచ్చి మా చినఅబ్బాయి రాధబాబు కనుపించలేదు.

నేను బావిలోకి తొంగి చూద్దును గదా ఆ చిన్న కుంక రాధబాబు నీళ్ళలో ఉక్కిరిబిక్కిరై తేలుతున్నాడు. "ఓరి బాబూ. ఓరి బాబూ, ఓరి నాయినా అంటూ కేక వేశాము అంతానూ"

ఒడ్డున కేక వేస్తూ అంతా ఎగురుతున్నామే గాని చటుక్కున లోపలికి దిగి వాడ్ని పైకిలాగాలని తోచలేదు. ఒక తాడు లోపలికి వెయ్యాలని తోచలేదు. ఏమీ

తోచ లేదు. "చూస్తారేం, దిగండి" అని కేక వేసింది తల్లి. అప్పటికి నేను తెప్పరిల్లి వరలమీద కాలు పెట్టి దిగబోయాను. ఇంతలో రాధబాబు తేలి వరలు పట్టుకొని పైకి వస్తున్నాడు.

చిన్న సన్యాసి బిక్కముఖంతో గజగజ వణికి పోతున్నాడు. "గట్టిగా పట్టుకో" "ఈ వరమీద కాలు పెట్టు" "జాగ్రత్త. జారుతుంది" అంటూ కేకలు పెట్టాము. నానా అవస్థా పడి ఎట్లాగైతేనేం వాడు పైకి వచ్చాడు.

తల్లి వాడ్ని గబుక్కున దగ్గరకు లాక్కుని ఏమిట్రా నాయనా, ఎందుకు దిగావురా బావిలోకి? అంటూ తల తుడుస్తున్నది తన పమిటి చెంగుతో.

నాకు గుండె దడ తగ్గలేదు. ఇంకా "అసలు బావిలోకి ఎందుకు దిగాడో కనుక్కో? అన్నాను పళ్ళు బిగబట్టి.

"కనుక్కుందాం లెండి. వణికిపోతున్నాడు. ఇంత వరకు మనం అదృష్టవంతులము. పండగ పూట కూడాను! చూశారూ ఎంత గండం తప్పిందో!" అంటూ ఆవిడ కొడుకును గట్టిగా కౌగిలించుకొంది. వీడు అప్పుడే తల్లిని గట్టిగా కావిలించుకొన్నాడు.

వీడు బావిలో ఎల్లాగ పడి వుంటాడూ అన్న సందేహం మాలో ఎవ్వరికీ లేదు. వాడికి బావిలో దిగటం అంటే సరదా. దాని కోసం వాడు చిన్న నాటకము ఆడుతాడు. నీటిపైన తేలేవస్తువు ఏదైనా ఒకటి ముందు బావిలోకి గిరాటేస్తాడు. ఏదో డబ్బా, పుల్లా అట్లాంటిది. అది చెయి జారి బావిలో పడ్డదన్న మాట. దాన్ని బొక్కెనతో తీయటానికి కాసేపు ప్రయత్నం చేస్తాడు. అది రాదు. ఆ పైన ఇహ బావిలోకి దిగడం అవసరము అవుతుంది. అప్పుడు వాడు దిగి ఒక పుల్లతో దాన్ని దగ్గరకు లాక్కొని, చేత్తో అందుకొని, ఆ పళంగా పైకి వస్తాడు. ఈ మధ్య పాప అరుస్తునే ఉంటుంది.

"దిగొద్దురా జారుతావేమోరా?"అని.

వద్దు అంటూ వున్నా పనిని నిర్భయముగా చేయడములో శౌర్యసాహసాలు ప్రకటన అవుతయ్యని వాడికి తెలుసు. దాని తరువాత చీవాట్లు తలిగినా సరే. ఇల్లాగ ఒకసారి గాదు అయిదారుసార్లు జరిగింది. ప్రతిసారీ చీవాట్లు వేస్తూనే వున్నాము.

అల్లాంటి పని చేయకురా, జారిపడ్డావా ప్రమాదంరా అంటూ. ఈ సారి కాలు జారి పడి వుంటాడు. భగవంతుడి దయ వల్ల ప్రమాదము లేకుండా బైటపడ్డాడు.

"ఈ గండము గడిచింది. కాని వాడికి గట్టిగా బుద్ధి చెప్పకపోతే యింకా ఎందుకన్నా పనికి వస్తాడా? బావిలోకి దిగాలిసిన పని ఏమి వచ్చిందో కనుక్కో వాడిని." అని నేను గట్టిగా కోపముగా అంటూ వాడ్ని కొట్టబోయాను.

"మీరు కొంచెము వుండండి. అసలు సంగతి కనుక్కోనీయండి" అంటూ ఆవిడ నాకు అడ్డము వచ్చి, "ఎందుకు దిగావురా? దేనికోసమూ దిగావురా నాయనా బావిలోకి, పిచ్చి బాబూ" అంటూ ఆవిడ ఆనందబాష్పాలు కార్చింది. వాడు మాట్లాడకుండా తల్లికి అతుక్కుపోయాడు.

ఇటువంటి విషయాల్లో పాప సాయము లేనిదే సాధారణముగా వాడు ఏ పనీ చెయ్యడు. అది బావిలో ఏదో పడేసి వీడిని దిగమని ప్రోత్సహిస్తుంది,

"ఈ అల్లరిలో నీవు వున్నావే పాపా? బావిలో ఏం పడేశావు! దయ్యమా చెప్పు?" అని కేకలేశాను.

"నేనేమీ యెరగను నాన్నా అసలు నేను ఇక్కడ లేను. అక్కడున్నాను. దభీమని మ్రోత విని పరుగెత్తుకొచ్చాను. నేనెయెరుగుదునేం? అంతా నా మీద పెడతారు" అంటూ బిక్క ముఖం పెట్టింది. బావిలోకి తొంగి చూస్తే, తేలుతూ వున్న వస్తువు ఏదీ అక్కడ కనిపించలేదు.

వాళ్ళమ్మ యింకా వాడికి వళ్ళు తుడుస్తూనే వుంది. "నా తండ్రి యెంత గండం తప్పిందిరా? పండగ పూట కూడాను! ఎంత అదృష్టవంతులమురా ఇవ్వాళా" అంటూ.

ఇంతకూ వాడు బావిలోకి ఎందుకు దిగాలిసొచ్చిందో తెలియలేదు. అప్పటికి నాకు కొంచెము దడ తగ్గింది. మళ్ళీ యిల్లాంటి పని ఎప్పటికి చెయ్యవద్దని, వాడికి గట్టిగా బుద్ధి చెప్పాలని అనుకొన్నాను. అందుకని ఒక సన్నని బెత్తము ఒకటి తీసుకొని వాడి దగ్గరకొచ్చి "ఏంరా అసలు నీవు బావిలోకి ఎందుకు దిగాలిసి వచ్చిందో చెప్పు?" అన్నాను బాగా ఉరిమి చూస్తూ, బెత్తం విసురుగా ఆడిస్తూ కూడాను.

"కొట్టకండి పండగపూట" అన్నది వాళ్ళమ్మ.

కొట్టకముద్దెట్టుకోమంటావా కొడుకునూ, ఇల్లాంటి పని చేసినందుకూ? వాడి వళ్ళు చీరేస్తాను. నీవు తప్పుకో. అని పైకి అంటూ మరేం చెయ్యను. ఊరికే కోప్పడతాను. నీవు అడ్డంరావద్దు అని అర్థం వచ్చే లాగున ఆమెకు కంటితో సంజ్ఞ చేశాను. ఆవిడ తప్పుకు వెళ్ళిపోయింది. "తన్నండి వెధవను ఎప్పుడూ ఇల్లాంటి పని చెయ్యకుండా" అని అంటూ.

రాధ బాబు నిస్సహాయుడు అయిపోయినాడు. పాప కూడా ఎదురు తిరిగింది. వాడు ఎప్పుడూ దిగుతూనే ఉంటాడు. నాన్నా, పడతావురా అని నేను గోలపెట్టి ఏడ్చినా వినడు నాన్నా అని వాడి స్వభావాన్ని గురించి సాక్ష్యం చెప్పింది.

నేను బెత్తము బాగా పైకెత్తి "ఏంరా బావిలో ఎందుకు దిగావో చెప్పు. చెప్పుతావా కొట్టనా?" అని అడిగాను.

బాగా ఏడ్పుముఖం పెట్టి నేను దిగలేదు నాన్నా అన్నాడు. తల్లి కూడా దగ్గర లేకపోవడము మూలాన ఆసరా ఎవ్వరూ లేరని తెలుసుకొని ఫెడేలుమని ఒక పెద్ద అబద్ధం ఆడేశాడు. అందుకని "ఎందుకురా అబద్ధము?" అని అడిగాను.

"అబద్ధాలు కాదు నాన్నా, నేను దిగలేదు" అన్నాడు మళ్ళా.

"మరేమిటి?"

ఆ ప్రశ్న మీద రాధబాబు నిజం సంగతి చెప్పుతానని ఈ విధముగా చెప్పాడు.

"అది కాదు నాన్నా. బొక్కెనతో నీళ్ళు తోడుతున్నాను. అసలు నేను బొక్కెన సగానికి నీళ్ళు తీద్దామని అనుకొన్నాను. కాని ఏమైంది అంటే అది గబుక్కున మునిగినిండిపోయింది. చాలా బరువు నాన్నా అది. నేను లాగలేక పోయినాను" అని అక్కడ ఆగాడు.

"ఊ, లాగలేకపోతే చెప్పు ఏమైందో" అన్నాను.

నేను కోపంగా, రాధబాబు బావురుమని ఏడ్చి ఏడుస్తూనే అన్నాడు.

"అప్పుడే బాగా వంగి ఇట్లా లాగుతున్నాను నాన్నా. ఆపళంగా కాలు జారి

తలక్రిందుగా పడిపోయాను నాన్నా."

మళ్లీ పెద్దగా బావురుమన్నాడు.

వంగితేమటుకు షడిపోతారా? అని నాకు సందేహము కలిగింది. గోడ ! అవతల వుండి, ఇదంతా వింటూన్న తల్లి తలుపు తోసుకొని వచ్చి పిల్లవాడ్ని కావిలించుకొని మా నాన్నే, తలక్రిందుగా పడ్డావురా నాన్నా? ఎంత గండం తప్పిందో! అంటూ వాడి వళ్ళంతా నిమిరి ముద్దెట్టుకొంది.

ఆటకోరుతనంగా బావిలో దిగి జారిపడటం కాదది. కాలుజారి పడ్డాడు. వాడి తప్పు అందులో ఏమీ లేదు. వాడ్ని యింకా కోప్పడటం అన్యాయం అని నాకు తోచింది. వాళ్ళమ్మ కూడా అల్లాగే అనుకొన్నది.

"అయితే దెబ్బతగల్లేదురా?" అని అడిగాను నేను. అంత తల్లక్రిందుగా పడితే తలకాయ వరలకు కొట్టుకోవలసింది.

దీనికి వాడేమీ సమాధానము చెప్పక ఊరుకొన్నాడు.

"ఎందుకు తగులుతుందండీ? నిటారున పడిపోయాడు" అని ఆమె సమాధానం చెప్పింది.

"అంతే అయియుంటుంది నాన్నా" అన్నది పాప.

అయితే మటుకు అసలు బొక్కెన బావిలో వేసి లాగాలిసినంత అవసరము వాడికేం కలిగింది? నీళ్ళు కావాలంటే యింట్లో లేవుకనకనా? అందుకని ఇటువంటి పిచ్చి పనులు ఎప్పుడూ చెయ్యవు గదా? అంటూ కొట్టబోయాను.

వాడు మళ్ళీ బావురుమని ఏడ్చాడు. పాపం వాడి తప్పు ఏముందండీ, కాలు జారి ఒరిగిపడిపోతేనూ? అయినదానికీ కానిదానికీ కూడా దండీస్తే ఎల్లాగ? పండగపూట పసివాడ్ని అన్యాయముగా కొట్టే వారే. అంటూ వాడిని తల్లి దగ్గరకు తీసుకొని ఓదార్చింది.

నాకుమటుకు వాడిని అన్యాయముగా కోప్పడ్డానన్న విచారము కలుగలేదు. అసలు నీళ్ళు తోడటానికి ప్రయత్నము చేయడము ఒక తప్పు. రెండోది చేద అంత బరువేస్తే దాన్ని బావిలోకి వదిలేయాలె. అంతేగాని దానితో కూడా లోపలికి

వెళ్ళడములో వాడికేదో కొంటెతనము ఉన్నట్లే నాకు అనుమానము.

వాడు తల్లిని కౌగలించుకొని ఇంకా ఏడుస్తూ ఉంటే నాకు మళ్ళా జాలి వేసింది. పండగపూట కోప్పడ్డానే అని.

పెద్ద దయ్యంలాంటి బొక్కెన కొనుక్కొని వచ్చారు. నేనే లాగలేక పోతున్నాను. వాడికేం సాధ్యమౌతుంది. క్రిందికి గుంజేసింది కామాలు ఆ బొక్కెన? లేదులే నాన్నా ఇవ్వాళ రోజు అటువంటిది! ఏం జేస్తాం? ఇక రారా నాన్నా వెడదాము అంటున్నది తల్లి.

నేనూ వెళ్ళబోతున్నాను. ఇటు చూద్దునుగదా. అసలు బొక్కెన బావిపైనే ఉంది బండచాటున.

వాడు బొక్కెన లాగలేకపోయి పడితే అది బైటే ఎందుకు ఉంటుందీ? వాడు బ్రహ్మాండమైన అబద్ధం ఆడి అందరినీ నమ్మించాడు. వాళ్ళు ఎవ్వరూ బొక్కెన బైట ఉన్న సంగతి చూడలేదు. తల్లి అంటున్నది, "నాన్నా ఎప్పుడూ బావి దగ్గరకు వచ్చి ఇట్లాంటి పనులు చేయకేం" అని.

నేను 'ఏం జేశానే? బావిలో దిగానా ఏమన్నానా? కాలు జారి ఇట్లా ఢాం అని పడిపోయానే.' అంటున్నాడు వాడు. ఈ మాటలు వింటూంటే పాపం ఆ తల్లికి కన్నీళ్ళపర్యంతం అవుతున్నది.

చిన్నవాడైనా అబద్ధాలు ఆడటం బాగా నేర్చినట్లుంది. ఎక్కడా జంకూ కొంకూ కనపడటం లేదు. నిజం చెప్పేస్తున్నట్లే మాట్లాడుతున్నాడు ఏడ్పుముఖము పెట్టి. నాకు వళ్ళు మండి పోయింది. ఈ దొంగతనం చూచి.

చివరకు నేనన్నాను – "అయితే రాధబాబూ బొక్కెన లాగబోయి పడ్డావు కదా. బొక్కెన ఏమైందిరా?" అని.

"బావిలో పడ్డది" అని రపీమని జవాబు చెప్పాడు తడుముకోకుండా.

"మునిగిపోయిందా తేలిందా?" అని అడిగాను నేను. వాడు తెల్లపోయి నా వంక చూచి, "ఎక్కడన్నా తేలుతుందా ఏమిటి?" అన్నాడు.

అయితే ఇదేమిటిరా? బావిలో ఉండాలిసిన బొక్కెన పైన ఎందుకు ఉంది?

చెప్పవేంరా?" అని అడిగాను కళ్ళు ఉరిమిచూస్తూ.

అంతా తెల్లపోయినారు. వాడూ తెల్లపోయినాడు. వాడు ఇందాకటి నుండీ అల్లుకొచ్చిన కథ అంతా టఫీన ఎగిరిపోయింది. వర్తిగాలి పోగు చేసిన కథ అల్లాడు. అంతా నమ్మాము కూడాను. వాడు చెప్పినదంతా పచ్చి అబద్ధాలు అని అందరికీ తెలిసింది. ఒక్కసారి అంతా నవ్వారు ఫక్కున.

రాధబాబు ముఖం మరీ తెల్లబడ్డది. కథ అడ్డంగా తిరిగిందని వాడికీ తెలిసింది కాబోలు బిత్తరపోయినాడు.

"కొడతారని భయపడి అబద్ధం ఆడాడు లెండి." అంటూ తల్లి వాడిని సమర్థించింది. బొక్కెన కూడా బావిలోకి గిరాటు వేసినట్లు, అయితే వాడు ఆడిన అబద్ధం అభేద్యం అయ్యేది. ఆ బొక్కెన కాస్తా బైట ఉండబట్టి అంతా బట్టబయలు అయి వాడు అబద్ధం ఆడుతున్నాడని తెలిసింది.

నాకు మటుకు చెడ్డకోపంగా ఉంది. వీడు ఇంత అబద్ధం ఆడాడే అని. ఒక వేపబెత్తము తీసుకొని "వళ్ళు చీరేస్తాను ఎందుకు ఇంత అబద్ధం ఆడావు?" అన్నాను నేను కోపంగా.

"నేను అబద్ధం ఆడలేదు నాన్నా" అని వాడు మళ్ళీ అన్నాడు.

"అబద్ధం ఆడటం లేదు? ఓరి కొంటెసన్యాసి, ఇంకా బొక్కెన బరువై లాగలేకే పడ్డానూ అంటావూ? ఇంకా అల్లాగే అంటావా?" అని గర్జించినా, వాడు భయపడక 'అవును నాన్నా' అన్నాడు. నిజానికి కట్టుబడ్డవాడిలాగ చూస్తూ.

ఇంత గట్టిగా రెట్టిస్తున్నాడు. వీడిని ఏం జేసినా పాపం లేదు అనుకొన్నాడు.

అయితే బొక్కెన బావిలో ఉండాల్సింది బైటకెల్లాగు వచ్చిందిరా? అని అడిగాను.

"ఏమో ఎట్లా గొచ్చిందో" అన్నాడు. ఏమంటాడు అంతకంటే. వాడనటం బొక్కెనకు కాళ్ళొచ్చి అదంతట అదే బైటికొచ్చిందని.

ఇదివరలో మా యింట్లో గాజు గ్లాసులూ, చిమ్నీలు వాటంతట అవే పగులుతుండేవి. సిరాబుడ్లు బల్ల మీద వాటంతట అవే పలికిపోతుండేవి. సిరా

అంతా పుస్తకాల మీద పడ్డ తరువాత ఆ బుడ్లు మళ్ళీ వాటంతట అవే లేచి స్వస్థానంలో ఉంటూ ఉండేవి.

మంచి నీళ్లలోకి బొగ్గులు వాటంతట అవే వచ్చి పడి తేలుతూ ఉండేవి. ఇటువంటి గారడీలు చెయ్యటం మా వాడికి బాగా తెలుసు. అల్లాగే బొక్కెన కూడా దానంతట అదే బావిలోనుంచి ఎగిరి బైటకొచ్చి కూర్చున్నది అన్న మాట?

ఇటువంటి అబద్ధాలు ఆడినందుకు సరియైన శిక్ష విధించకపోతే వీడు ఎందుకూ పనికిరాకుండా పోతాడు. అంటూ ఆ వేపపుడకతో ఒక్కటి వేశాను.

వాడు బిక్క ముఖముతో నన్ను చూచి ఏడ్చాడు. తల్లి వాడిని తన చాటుకు తీసికొని లోపలకు తీసుకుపోయింది.

నేనింకా అక్కడే నుంచున్నాను. వాడు ఇంతకూ నిజం ఒప్పుకోలేదు. ఆపళంగా వాడ్ని వదిలేస్తే ఏమైనట్టు? ఇంకా రెండు తగిలిస్తే గాని నిజం ఒప్పుకోడు. తగిలిన రెండు దెబ్బలూ ఏమంత గట్టివీ కావు.

పసితనంలో ఏదో అబద్ధం ఆడాడులే అని సరిపెట్టుకొని ఊరుకుంటే, వాడు యింకా అబద్ధాలు ఆడటం నేర్చుకొంటాడు. వాడి చేత నిజం చెప్పించి, అబద్ధం ఆడితే లాభం లేదనీ, నిజం దాగదనీ, వాడు తెలుసుకొనేటట్టు చెయ్యాలి.

అదీగాక తాను చెప్పినదంతా వట్టి అబద్ధం అని బైటపడ్డా ఇంకా దబాయిస్తున్నాడు. నీవు చెప్పిందే నిజమైతే బొక్కెన బైట ఎల్లా ఉందిరా? అని అడిగితే 'ఏమో ఎట్లా ఉందో' అనటం దబాయింపుగాక మరేమిటి?

చేసిన తప్పును కప్పి పుచ్చటానికి ఒక అబద్ధం ఆడటం దానికి పోటీ ఇంకో అబద్ధం! ఆ రెండూ కూడా నిలబడలేక పోతే దబాయింపు! ఇల్లాంటి ప్రవర్తన అలవాటైతే ఇంకేమన్నా ఉందా?

అని నేను ఇల్లాగ చాలాసేపు ఆలోచించుకొని ఏమైనా కానీ, వీడిచేత ఇవ్వాళ నిజం చెప్పించాలె. సత్యాన్ని వాడి నోటితోనే పలికించాలె. బెదిరించి చూస్తాను. నిజం ఒప్పుకొన్నాడా సరేసరి. బెదిరింపులకు లొంగకపోతే ఇంకా రెండు గట్టి దెబ్బలు వెయ్యటానికి కూడా సందేహించకూడదు. తండ్రి అయినవాడు చెయ్యాలిసిన విధి

ఇది. అని నిశ్చయించుకొని ఇంట్లోకి వెళ్ళాను.

నా నిశ్చయం నా నడకలోకి నా ముఖంలోకి నా చూపుల్లోకి పాకింది. రాధబాబుకు కొత్త చొక్కా తొడుగుతున్న తల్లే నన్ను చూచి బిత్తరపోయింది. కోపాన్ని కక్కుతున్న నా కళ్ళనూ, బిగబట్టిన పళ్ళనూ చూచి రాధబాబు గజగజవణికిపోయాడు.

నేను వాడి దగ్గరకెళ్ళి అన్నాను – "ఒరేయ్! నీవు అబద్ధం ఆడావు. నీవు అబద్ధాలు ఆడావని వీళ్ళందరికీ తెలుసు!" అని మా ఆవిడ వంక తిరిగి ఏమే అబద్ధం ఆడుతున్నాడంటావా? లేదంటావా? అని అడిగాను మండిపోతూ.

"ఆ అబద్ధం కాక నిజం చెప్పాడని ఎవరంటున్నారు? పసి వాడు కాబట్టి క్షమించి ఇంతటితో పోనీయమంటున్నాను" అన్నది.

"అబద్ధం ఆడానని ఒప్పుకోమను వాడిని. ఒప్పుకొని ఇంక ఎప్పుడూ అబద్ధం అనేది నోట రానీయనూ అంటే క్షమించి ఊరుకొంటాను. లేదో ఇవ్వాళ వాడి వళ్లు పగిలిందే" అంటూ మా ఆవిడను రెక్కుచ్చుకొని వాడి దగ్గర నుంచి అవతలకు లాగేసి బెత్తం పైకెత్తాను.

పిల్లవాడ్ని బాగు చేసి మంచి మార్గానికి త్రిప్పి సత్పథంలో పెట్టాలన్న ఆవేశమే నాకు తాత్కాలికంగా కోపాన్ని తెచ్చి పెట్టింది. కొట్టడానికి సిద్ధం అయినాను.

నేను బెత్తం పైకెత్తేసరికి పాప కెవ్వున కేక పెట్టి ఏడ్చింది. హడలిపోయి నా ఉగ్రం జూచి, అడ్డం రావటానికి సాహసించలేక మా ఆవిడ కూడా దిగులు ముఖంతో కొడుకు వంక చూసింది.

ఇక రాధబాబు సంగతి చెప్పనక్కరలేదు. నోట మాట రాలేదు. నిశ్చేష్టుడైపోయి కళ్ళ నీళ్ళు కారుస్తూ నించున్నాడు.

నేను ఎత్తిన బెత్తం ఎత్తినట్లే ఉంచి, "ఏంరా అబద్ధం ఆడావా?" అని ఒక పెద్ద రంకె పెట్టాను. వాడు వణికిపోతూ అవునన్నట్లు తల ఊపాడు.

బావిలో దిగాలని దిగావు కదూ?

అవును

దేనికోసం దిగావు?

ఊరికేనే.

సరదాకా?

ఆ.

ఇంకెప్పుడూ అల్లాగ దిగవు కదా?

దిగను.

ఇంకెప్పుడూ అబద్ధాలు ఆడవు కదా?

ఆడను.

ఇంకో మారు అబద్ధం ఆడావంటె, కొట్టేస్తాను తెలిసిందా?

ఆ.

నిజం ఒప్పుకొన్నాడు. ఇహ వాడిని ఒదిలేయాలనుకొన్నాను. ఆ సమయానే తల్లి వచ్చి కొడుకుని రెండు చేతుల్లోకి తీసుకొని, ఇహ వెళ్ళండి నిజం చెప్పాడుగా. ఇహ ఎప్పటికీ అబద్ధం కూడా చెప్పడు. అంటూ వాడిని వంట ఇంట్లోకి లాక్కెళ్ళింది.

పాప వచ్చి నేను గోడకు ఆనించి పెట్టిన బెత్తాన్ని తీసుకొని ముక్కలు ముక్కలు చేసి పారేసింది. "నిజం చెప్పబట్టి సరిపోయింది, లేకపోతే నాన్న ఆ కోపంలో పాపం వాడ్ని బాదేసి ఉందురు" అంటున్నాడు శాస్త్రి వాళ్ళమ్మతో.

నాకు చాలా సంతోషం కలిగింది. చెయ్యి చేసుకోకుండానే వాడిచేత నిజం ఒప్పించగలిగినందుకు. వాడిని పండగ పూట ఏడిపించానే అని జాలి కూడా వేసింది. ఇంతకూ ఏం జేసినా వాడి బాగుకోరే గదా చేసింది. నాకు నేనే సమాధానము చెప్పుకొన్నాను.

"నిజం ఒప్పుకొన్నాడు. ఆదే సంతోషం" అనుకొంటూ దొడ్లోకి వెళ్ళాను. మా ఇంటి ప్రక్క ఆవిడ అక్కడ బావి దగ్గర దేనికోసమో అటూ ఇటూ చూస్తున్నది. కాసేపు నేను అక్కడే నుంచున్నాను, జామ చెట్టు వంక చూస్తూ. ఆవిడ బావికి నాలుగుప్రక్కలా దేనికోసమో వెతికింది. కనపడలేదు కామాలు. అయోమయంగా

చూస్తూ, లోపలికెళ్ళి వంట యింటి గుమ్మంలో నుంచుని అడుగుతున్నది మా ఆవిడను "ఏమమ్మా కాంతమ్మొదినే చేద కనపడదేం?" అని.

"బావి దగ్గరనే ఉందమ్మా చేదా" అన్నది మా ఆవిడ.

"అది మీ బొక్కెనమ్మా. మా బొక్కెన ఒకటి ఉండాలె. ఇందాకా తెచ్చి ఒక బిందెడు నీళ్ళు తోడుకెళ్ళి మళ్ళీ ఇంకో బిందెకు ఎల్లాగూ రావాలె గదా అని ఇక్కడే పెట్టి వెళ్ళాను అంతా మీ దాని మోస్తరే ఉంటుందిలే. ఒక వేళ అదే మీది అనుకొని ఇంట్లో పెట్టావేమో అని అడుగుతున్నాను" అన్నది ఆవిడ.

ఈ మాటలు నా చెవిని బడ్డయి. వళ్ళు ఝల్లుమంది. వీపుపైన ఛెళ్ళున కొట్టినట్లు అయింది.

ఇంతలో మా ఆవిడ వంట యింట్లో నుంచి ఒక్క గంతులో దొడ్లోకి వచ్చి, నా వంక చురచురా చూస్తూ అడిగింది.

విన్నారా?

ఏమిటి. అన్నాను నేను ఏమీ ఎరగనట్టు.

ఏమిటా? వదినగారు చేద ఇక్కడ వదిలేసి పోయింది. రాధబాబు దాన్నే బావిలో పడేసి ఉంటాడు.

"అంతే అయి ఉంటుంది" అన్నాను. నేను చమత్కారంగా. ఎంత నిర్లక్ష్యంగా అన్నారండీ? రాతి గుండె మీది. నేను మొట్టమొదట నుండీ మొత్తుకుంటూనే ఉన్నా వాడినేమీ అనకండి అని. నిజం ఒప్పిస్తా నిజం ఒప్పిస్తానంటూ, అంతెత్తులేస్తిరి. నోరెత్తితే నా మీద ఎక్కడ విరుచుకుపడతారో అని నోరు నొక్కుకొని ఊరుకొన్నాను. చెప్పించారు! నిజం! అని ఈసడిస్తూ కళ్ళ నీళ్ళు తుడుచుకొంది.

"ఏం జేశామా?" అన్నాను నేను క్రుంగిపోతూ.

"ఏం జేశారా? ఏమీ ఎరగని అమాయకపు చిన్న సన్యాసికి అబద్ధం ఆడడం నేర్పారు" అని మరోసారి కళ్ళు ఒత్తుకొని వెళ్ళిపోయింది.

క్రుంగిపోయి నీరసంగా దిగులుగా పశ్చాత్తాపముతో నిలబడిపోయినాను.